రోల్ మోడల్‌గా ఏయూ ఫార్మసీ హాస్టల్

- సమగ్ర వసతులకు విద్యార్థినులు ఫిదా
- ప్రైవేటు హాస్టళ్లకు దీటుగా నిర్వహణ
- 180 మందికి పైగా స్టూడెంట్లకు వసతి


ఫార్మసీ విద్యార్థినుల హాస్టల్


ఆధునిక టాయిలెట్స్

ఏయూ క్యాంపస్: సమగ్ర వసతుల సమాహారంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ విద్యార్థినుల హాస్టల్ నిలుస్తోంది. ప్రైవేటుకు దీటుగా.. వర్సిటీ హాస్టళ్లకు రోల్ మోడల్‌గా నిలిచేలా దీనిని నిర్వహిస్తున్నారు. హాస్టల్ నిర్వహణ, వసతులపై విద్యార్థినులు ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం 180 మందికి పైగా విద్యార్థినులు ఇక్కడ వసతి పొందుతున్నారు. సెల్ఫ్ సపోర్ట్ హాస్టల్‌గా విద్యార్థులే దీని నిర్వహణ బాధ్యతలు చేపడుతున్నారు.


విద్యార్థినులకు అందించే ఆహారం

చేరువలోనే..

ఫార్మసీ విద్యార్థినులకు తమ కళాశాలకు చేరువలో నూతనంగా హాస్టల్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మూడు అంతస్తుల్లో మొత్తం 35 గదులు విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. వీటితో పాటు ప్రతి అంతస్తులో మూడు టాయిలెట్ బ్లాక్‌లు, పేరెంట్స్ వచ్చినప్పుడు ఉండటానికి ఒక గది, ఆఫీస్ రూమ్, డైనింగ్ హాల్ వంటివి నిర్మించారు. కాలేజీకి చేరువలో హాస్టల్ ఏర్పాటు చేయడంతో విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో అన్ని వసతులు..

విద్యార్థులు తమ సొంతింట్లో ఉన్నామనే భావన కలిగించేలా హాస్టల్‌లో వసతులు ఉన్నాయి. తాగునీటి కోసం ఆర్వో వాటర్ ప్యూరిఫైయింగ్ వ్యవస్థను నిర్మించారు. వేడి నీరు సరఫరా చేసేలా గ్రీజర్‌లు ప్రతి టాయిలెట్‌లో ఏర్పాటు చేశారు. వీటితో పాటు వైఫై సదుపాయం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేకంగా ఏయూ సెక్యూరిటీతో పాటు హాస్టల్ లోపల మహిళా సెక్యూరిటీ, పారిశుధ్య సిబ్బందిని నియమించారు. మరుగుదొడ్లను రోజూ నాలుగు సార్లు కాలానుగుణంగా శుభ్రం చేస్తుంటారు. గదులు, కారిడార్‌ను రోజూ తుడిచి, తడిగుడ్డతో శుభ్రం చేస్తున్నారు. విద్యార్థుల డైనింగ్ హాల్‌ను ఉదయం, సాయంత్రం మెస్ సమయాల్లో నిరంతరం శుభ్రం చేయడానికి సిబ్బందిని అందుబాటులో ఉంచారు. విద్యార్థులు తమ దుస్తులు ఉతుక్కోవడానికి ప్రత్యేకంగా వాషింగ్ మెషీన్‌ను ఏర్పాటు చేశారు. హాస్టల్ చీఫ్ వార్డెన్ ఆచార్య ఎ.కె.ఎం.పవార్ ప్రత్యేక చొరవ తీసుకుని అవసరమైన అన్ని వసతులు కల్పించారు.

ఆహ్లాదంగా.. ఆరోగ్యంగా..

విద్యార్థుల గదులకు ప్రత్యేకంగా కర్టెన్‌లు, చెప్పుల స్టాండ్‌లు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఆది, బుధ వారాల్లో చికెన్, మంగళ, శుక్రవారాల్లో గుడ్డు ఆహారంగా అందిస్తున్నారు. రుచికరంగా.. పరిశుభ్రంగా పోషకాహారం అందించడంతో విద్యార్థినులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చదువుకోవడానికి ప్రత్యేకంగా టెర్రస్‌పై బెంచీలు ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళలో ఇక్కడ ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకోవడానికి అవకాశం ఏర్పడింది. షటిల్ కోర్టును సైతం హాస్టల్ ప్రాంగణంలో నిర్మించడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.


నిరంతరం మెస్‌ను శుభ్రం చేస్తున్న సిబ్బంది


మెస్‌లో భోజనం చేస్తున్న విద్యార్థినులు

సమయం ఆదా అవుతోంది

గతంలో ఎంవీపీ కాలనీ హాస్టల్‌లో ఉన్నాం. కాలేజీకి దగ్గరగా ఈ హాస్టల్ ఉండటం వల్ల సమయం ఆదా అవుతోంది. భోజనం కూడా చాలా బాగుంటోంది. మాకు అవసరమైన అన్ని వసతులు ఇక్కడ కల్పించారు.

– టి.గాయత్రి,
డి.సాయి పవిత్ర,
బి.ఫార్మసీ విద్యార్థినులు

ప్రైవేట్ హాస్టళ్ల కంటే మెరుగ్గా..

మొదట్లో కొంత కాలం ప్రైవేట్ హాస్టళ్లలో ఉన్నాం. అక్కడ నెలకు రూ.6 వేలకు పైగా చెల్లించాం. ప్రస్తుతం ఏయూలో దీనిలో సగం ఖర్చుతో రుచికరమైన భోజనంతో హాస్టల్ ఏర్పాటైంది. వసతులు, నిర్వహణ, భద్రత మూడు అంశాలు ఇక్కడ చక్కగా నిర్వహిస్తున్నారు.

– జి.రోజా,
కె.మౌనిక, ఫార్మా డీ,
బీ.ఫార్మా విద్యార్థినులు

డ్రాపవుట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి


వివరాలు తెలుసుకుంటున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: డ్రాపవుట్ల నివారణకు ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. డ్రాపవుట్ సర్వేలో భాగంగా బడికి రాకుండా ఇళ్ల వద్దనే ఉంటున్నట్లుగా గుర్తించిన వారి వివరాలను తెలుసుకునేందుకు మంగళవారం రాత్రి ఆమె నగరంలోని న్యూకాలనీ, ధర్మనగర్ ఏరియాల్లో పర్యటించారు. సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు, సీఆర్పీలు, సచివాలయ సిబ్బందిని వెంట తీసుకొని డ్రాపవుట్స్ పిల్లల ఇళ్లకు నేరుగా వెళ్లారు. వారి తల్లిదండ్రులు, సంరక్షకులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని వారికి వివరించారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక వంటి పథకాలు అందుతాయన్నారు. బడి ఈడు పిల్లలను ఇళ్ల వద్ద ఉంచుకునేందుకు వీల్లేదని, బడికి పంపించాల్సిందేనన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా కో–ఆర్డినేటర్ వానపల్లి శైలజ, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిందితుడికి రిమాండ్

బీచ్ రోడ్డు: బస్సులో అక్రమంగా తరలిస్తున్న 40 కేజీల గంజాయిని సోమవారం రాత్రి సత్యం జంక్షన్ వద్ద చేసిన తనిఖీల్లో మూడో పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితుడైన మహారాష్ట్రకు చెందిన సరపరాజ్(26)ను విచారణ అనంతరం మంగళవారం రిమాండ్‌కు తరలించినట్టు మూడో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ రామారావు తెలిపారు.

క్లుప్తంగా

‘సమాచారం లేకుండా కేబుల్ వైర్ల కత్తిరింపు’


వైవీ సుబ్బారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎంఎస్‌వోలు

బీచ్ రోడ్డు: నగరం సుందరీకరణ ప్రక్రియలో భాగంగా జీవీఎంసీ అధికారులు తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కేబుల్, ఫైబర్ వైర్లను కత్తిరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి ఎంఎస్‌వోలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నగరంలోని ఒక హోటల్‌లో ఆయనను కలిసి సమస్య పరిష్కారం కోసం వినతిపత్రం అందజేశారు. వైర్లు కట్ చేయడం వల్ల అర్ధాంతరంగా టీవీ ప్రసారాలు, ఇంటర్‌నెట్ సేవలు నిలిచిపోయి వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని ఎంఎస్‌వోలు ఆవేదన వ్యక్తం చేశారు. నగర సుందరీకరణ బాధ్యత తమపై కూడా ఉందని, ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా వైర్లు కట్ చేయడంతో ప్రసారాలకు అంతరాయం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కోరారు. దీనిపై సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించారు.

బాలుర గృహం సందర్శన


బాలురు తయారు చేసిన క్లాత్ బ్యాగులను పరిశీలిస్తున్న బులికృష్ణ

ఆరిలోవ: ముడసర్లోవ దరి దీన్‌దయాళ్‌పురంలోని ప్రభుత్వ బాలుర గృహాన్ని మంగళవారం అంతర్జాతీయ వీధి బాలుర దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ సందర్శించారు. ఇక్కడ తరగతి గదులు, భోజన శాలను తనిఖీ చేశారు. క్లాత్ బ్యాగుల తయారీ, నటనలో శిక్షణ తరగతులను పరిశీలించారు. క్లాత్ బ్యాగులు తయారు చేసిన బాలురను ఆయన అభినందించారు. అనంతరం బాలురకు న్యాయ పరమైన విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గృహం సూపరింటెండెంట్ కె.వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు


డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న డిప్యూటీ చీఫ్ మేనేజర్ అప్పలనాయుడు

మద్దిలపాలెం: రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా ఆర్టీసీ డ్రైవర్లు, మెకానిక్, తదితర సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో మంగళవారం నిర్వహించిన వారోత్సవాలలో ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు డిప్యూటీ చీఫ్ మేనేజర్ అప్పలనాయుడు ప్రశంసా పత్రాలు అందజేసి, అభినందించారు. ఈ కార్యక్రమంలో మద్దిలపాలెం డిపో మేనేజర్ అరుణ, అసిస్టెంట్ మేనేజర్ బిందు, సూపర్‌వైజర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైభవునికి తులసీ దళార్చన

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువుదీరిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి సందర్భంగా బుధవారం తులసీ దళార్చన నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వామికి ఉదయం నిర్వహించే ప్రత్యేక పూజలు అనంతరం 9 గంటలకు తులసీ దళార్చన, తరువాత సామూహిక విష్ణుసహస్ర నామార్చన ఉంటుందని పేర్కొన్నారు.

సీఎం జగన్‌తోనే విశాఖ నగరాభివృద్ధి

- వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల
- 17వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం


ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న అక్కరమాని విజయనిర్మల, తదితరులు

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజన్‌తోనే విశాఖ నగరాభివృద్ధి సాధ్యమని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయ నిర్మల అన్నారు. మంగళవారం 17వ వార్డు పెద వాల్తేర్‌లో కార్పొరేటర్ గేదెల లావణ్య ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా అక్కరమాని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాలు అమలు తీరు.. సచివాలయ వ్యవస్థ పనితీరు.. పెన్షన్ల అమలు ప్రక్రియ ఎలా సాగుతుందో ఆరా తీశారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా ప్రకటించడం ద్వారా ముఖ్యమంత్రి జగన్‌కు విశాఖపై అభిమానాన్ని చాటడంతో పాటు అభివృద్ధి విజన్‌ను వెల్లడించారన్నారు. పరిపాలన రాజధానిగా విశాఖ దేశంలోని అత్యుత్తమ నగరంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గేదెల నాగరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం


మంటల్లో కాలుతున్న ద్విచక్ర వాహనం

ఆరిలోవ: రహదారిపై ప్రయాణిస్తుండగా ఓ ద్విచక్ర వాహనం దగ్ధమైంది. బీఆర్‌టీఎస్ రోడ్డులో ముడసర్లోవ వద్ద జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఆరిలోవ ప్రాంతం నుంచి ఇద్దరు వ్యక్తులు హోండా యాక్టివ్‌పై పైనాపిల్ కాలనీ వెళ్తున్నారు. ముడసర్లోవ రిజర్వాయరు దాటి విశాఖ కేంద్ర కారాగారం సమీపానికి వెళ్లేసరికి బైక్ వెనక భాగంలో చిన్నగా మంటలు వచ్చాయి. వారి వెనక ప్రయాణించేవారు మంటలు గమనించి వాహనచోదకుడికి చెప్పారు. వెంటనే వారు రామకృష్ణాపురం ఎదురుగా వాహనం నిలిపి దూరంగా పారిపోయారు. సుమారు 10 నిమిషాలలో ఆ వాహనం నుంచి పెద్దగా మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. వాహనంలో ఎలక్ట్రికల్ వైర్లు కలిసిపోయి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాప్తించి ఉంటాయని పలువురు భావిస్తున్నారు. బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరూ దూరంగా పారిపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

వేధింపులపై బాలలకు అవగాహన


మాట్లాడుతున్న చైల్డ్‌లైన్ కో–ఆర్డినేటర్ డేవిడ్

ఆరిలోవ: శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను మంగళవారం విశాఖ జిల్లా చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ ఎం.డేవిడ్ సందర్శించారు. ఇక్కడ ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఎంత మంది చదువుతున్నారో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ×బాలలపై వేధింపులు అరికట్టాలి×అనే అంశంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వివిధ వయసులలో ఎదురయ్యే సమస్యల గురించి వివరించారు. వాటిని ఏవిధంగా ఎదుర్కోవాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ లైన్ సిబ్బంది, గురుకులం వైస్ ప్రిన్సిపాల్ బి.రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి


కంచరపాలెం మెట్టు వద్ద అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ మళ్ళ అప్పారావు

మర్రిపాలెం: గతేడాది హెల్మెట్ ధరించకుండా రోడ్డు ప్రమాదాలకు గురై 147 మంది ద్విచక్ర వాహనచోదకులు మృతి చెందారని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ళ అప్పారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం తాటిచెట్లపాలెం, కంచరపాలెంమెట్టు, ఊర్వశి జంక్షన్, పంజాబ్ హోటల్, ఆర్ అండ్ బీ, మర్రిపాలెం, కరాస ఎన్ఏడీ కూడలి, కాకానినగర్ తదితర కూడళ్లలో హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనచోదకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. సీసీ ఫుటేజీల్లో ఉన్న ప్రమాద దృశ్యాలను చూపించి వాహనచోదకులకు కౌన్సెలింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో కంచరపాలెం ఎస్ఐలు ఉల్‌హక్, వాసుదేవరావు, పాపారావు, హెచ్‌సీలు సుబ్బారావు, కానిస్టేబుల్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

‘పూర్ణామార్కెట్‌ను ప్రైవేటీకరించొద్దు’

డాబాగార్డెన్స్: విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలో అతి పెద్ద కూరగాయల మార్కెట్ పూర్ణామార్కెట్‌ను ప్రైవేటీకరించొద్దని కార్పొరేటర్లు మహ్మద్ సాధిక్, ఉరికిటి నారాయణరావు మంగళవారం నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాధిక్ మాట్లాడుతూ పూర్ణామార్కెట్ ప్రైవేటీకరణ వల్ల నిత్యావసర కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. తక్షణమే అజెండా నుంచి తొలగించాలని సాధిక్ డిమాండ్ చేశారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పన అభినందనీయం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

బీచ్ రోడ్డు: నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గోబడ్డీ యాప్‌ను రూపొందించడం అభినందనీయమని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఈ మేరకు నగరంలో గోబడీ యాప్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. స్థానికంగా ఉంటూ ఉపాధి చేసుకునే అవకాశం ఈ యాప్ ద్వారా కల్పించడం మంచి ఆలోచన అని కొనియాడారు. యాప్ ప్రతినిధి పంచాడ నర్సింగరావు మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా ఏసీ టెక్నీషియన్లు, డ్రైవర్లు, ఎలక్ట్రీషియన్లు, కార్పెంటర్లు, ప్లంబర్లు, పెయింటర్లకు ఉపాధి కల్పించనున్నామన్నారు. ఉపాధి కోసం 93477 85705 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

నేడు సత్యసాయిబాబా వ్రతం

మురళీనగర్: పట్టాభిరెడ్డితోటలోని సత్యసాయిబాబా మందిరంలో పట్టాభిరెడ్డితోట భజన మండలి, మాధవధార సమితి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సత్యసాయిబాబా వ్రతం నిర్వహించనున్నారు. ఉదయం 4.45 గంటలకు ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, 8 గంటలకు సత్యసాయిబాబా వ్రతం చేయనున్నారు. ఉదయం 12 గంటలకు ఆశ్రమం పిల్లలకు నారాయణసేవ, సాయంత్రం 5 గంటలకు జ్యోతి ప్రజ్వలన, వేద పఠనం, నామ సంకీర్తన, 5.45 గంటలకు బాలవికాస్ పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, 6.30 గంటలకు జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త సూర్యనారాయణ మాస్టారి ప్రసంగం, 7.30 గంటలకు అఖండ జ్యోతి మంగళ హారతి, ప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలికలు

అల్లిపురం: స్కూలుకు వెళ్లిన ఇద్దరు బాలికలు తప్పిపోయిన ఘటనలో పోలీసులు చొరవ తీసుకుని వారిని వెతికి పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. జగదాంబ జంక్షన్‌లోని సెవెంత్ డే అడ్వెంటిస్ట్ స్కూల్లో 7,9 తరగతులకు చెందిన ఇద్దరు బాలికలు సోమవారం సాయంత్రం ఇంటికి చేరుకోలేదని వారి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. డీసీపీ పర్యవేక్షణలో ఈస్ట్ ఏసీపీ, మహారాణిపేట సీఐ, ఎస్ఐలు రంగంలోకి దిగి సీసీ కెమెరాల ద్వారా శోధించారు. రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, బీచ్‌రోడ్డు, పూర్ణామార్కెట్, డాల్ఫిన్ రూట్, జగదాంబ జంక్షన్ తదితర ప్రాంతాల్లో గాలించి సీసీ ఫుటేజీల ఆధారంగా బాలికలను గుర్తించారు. బాలికలను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

2న సహస్ర తులసిపూజ .. కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఫిబ్రవరి 2న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

తీర ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దాలి

బీచ్‌రోడ్డు పర్యటనలో జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు


బీచ్‌రోడ్డు సుందరీకరణ పనులపై అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ రాజాబాబు


డాబాగార్డెన్స్ : విశాఖలో మార్చిలో జరగనున్న జి–20 సదస్సుకు చేపడుతున్న నగర సుందరీకరణ పనుల్లో భాగంగా బీచ్ తీర ప్రాంతాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. బీచ్‌రోడ్డులోని పలు చోట్ల సుందరంగా తీర్చిదిద్దవచ్చని పర్యావరణ నిపుణులు సూచించిన మేరకు మంగళవారం ఆయన ఆర్కేబీచ్ నుంచి రాడిసన్ బ్లూ హోటల్ వరకు అధికారులతో కలిసి ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మార్చిలో నిర్వహించే జి–20 సదస్సుకు అధిక సంఖ్యలో విదేశాల నుండి అతిథులు విశాఖ నగరానికి విచ్చేస్తున్న సందర్భంగా, విశాఖ సాగరతీర ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లు, విద్యుత్ దీపాలు, సెంటర్ డివైడర్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం, కొబ్బరి, సరుగుడు చెట్లను అవసరమైన చోట్ల ఏర్పాటు చేయడం, గోడలకు నూతనంగా ఆకర్షణీయమైన బొమ్మలతో రంగులు వేయడం వంటి పనులు చేపట్టాలన్నారు. తీర ప్రాంతం వెంబడి ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని.. వ్యర్థాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విశాఖ కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి వరకు ఉన్న సాగర తీరం విశాఖ నగరానికి మణిహారమన్నారు. తీర ప్రాంతాన్ని అతిథులు అబ్బురపడేలా సుందరీకరించాలన్నారు. సెంటర్ డివైడర్లలో ఉన్న మొక్కలను ట్రిమ్మింగ్ చేసి అందమైన ఆకృతులతో తీర్చిదిద్దాలని కమిషనర్ అధికారులకు సూచించారు. పర్యటనలో జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి, ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి సురేష్, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, పర్యవేక్షక ఇంజినీరు వేణుగోపాల్, కార్యనిర్వాహక ఇంజినీరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

టన్నెల్ అక్వేరియంను సందర్శించిన వీసీలు


టన్నెల్ ఫిష్ అక్వేరియంను తిలకిస్తున్న వీసీలు, ఏఐయూ సభ్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్, ఏయూ సౌజన్యంతో నిర్వహిస్తున్న సదస్సుకు హాజరైన దక్షిణ భారత విశ్వవిద్యాలయాల ఉప కులపతులు(వీసీలు) మంగళవారం రాత్రి ఏయూ హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అండర్ వాటర్ టన్నెల్ ఫిష్ అక్వేరియంను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐయూ కార్యదర్శి పంకజ్ మిట్టల్, ఉపాధ్యక్షుడు జి.డి.శర్మ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐయూ కార్యదర్శి పంకజ్ మిట్టల్ మాట్లాడుతూ పర్యాటకంగా విశాఖ నగరం అద్భుతంగా ఉందన్నారు. బీచ్ రోడ్డులో సబ్‌మెరైన్ మ్యూజియం, యుద్ధ విమాన మ్యూజియం, వీటికి తోడుగా టన్నెల్ ఫిష్ అక్వేరియం పర్యాటకులకు ఎంతో సంతృప్తిని ఇస్తాయన్నారు.

కమనీయం రుక్మిణీ కల్యాణం


రుక్మిణి శ్రీకృష్ణుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సీతంపేట: లలితా పీఠం దర్బారు హాల్లో రుక్మిణీ సహిత శ్రీకృష్ణ కల్యాణం మంగళవారం సాయంత్రం వైభవంగా జరిగింది. పండితుల వేదమంత్రాలు, మేళ తాళాల మధ్య కుర్తాళం పీఠ ఆస్థాన వేద పండితుడు మాచవోలు రమేష్‌శర్మ శాస్త్రోక్తకంగా కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా రుక్మిణీ శ్రీకృష్ణుల ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, పూలమాలలు, ఆభరణాలతో అలంకరించారు. మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలు కమనీయంగా సాగాయి. రుక్మిణీ శ్రీకృష్ణులలోని ప్రేమతత్వం అందరిలో రావాలని పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆదేశాల మేరకు కల్యాణం జరిపిస్తున్నట్టు ఆస్థాన పండితులు తెలిపారు. పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణం వీక్షించారు. కుర్తాళం, లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పర్యవేక్షించారు. ముందుగా కుమారి డాక్టర్ ప్రియాంక చేసిన భరతనాట్యం ఆహూతులను అలరించింది. ఈ కార్యక్రమంలో శక్తి పీఠాదీశ్వరి మాతా రమ్యానందభారతీ స్వామిని, పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.